'జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు'

గుజరాతీపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రాజగోపాలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలో 5,26,000 బ్రాయిలర్, 6,02,000 లేయర్, 7,00,100 నాటుకోళ్లు ఉన్నాయి. బర్డ్‌ఫ్లూకు సంబంధించి 68 ర్యాపిడ్ రెస్పాన్స్ టీములు ఏర్పాటు చేసి, ప్రతి రోజూ కమర్షియల్ కోళ్లఫారాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల్లో వలస పక్షుల రక్తనమూనాలు సేకరించి, ల్యాబ్‌కు పంపుతున్నాం. ప్రస్తుతం జిల్లాలో ఈ వ్యాధి లక్షణాలతో కోళ్లు చనిపోవడం లేదు. ప్రజలు భయభ్రాంతులు కాకుండా కోడి మాంసం, గుడ్లు తినవచ్చు' అని రాజగోపాలం తెలిపారు.

సగానికిపైగా రెవెన్యూవే!

- ఈ శాఖ వినతులు 28,379
- రెండో స్థానంలో సర్వేశాఖవి
- జిల్లా నుంచి మొత్తం 55,075
- రాష్ట్రంలో అత్యధికం మనవే
- కొన్ని శాఖలకు 40శాతమే సంతృప్తి
- ప్రభుత్వ నివేదిక ద్వారా వెల్లడి



'మీ-కోసం'లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ (ఫైల్)

శ్రీకాకుళం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలపై అందిన వినతుల్లో సిక్కోలు ముందంజలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అందిన వినతులు.. అందులో శాఖలవారీగా అర్జీలు.. సంతృప్తిస్థాయి.. ఇలా వీటన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్(పీజీఆర్‌ఎస్) నివేదిక వెల్లడించింది. 26 జిల్లాలోనూ శ్రీకాకుళంలోనే అత్యధిక 55,075 అర్జీలు వచ్చాయని స్పష్టం చేసింది. వీటిలో కూడా రెవెన్యూ శాఖవి సగానికిపైగా ఉన్నాయి. రెండోస్థానంలో సర్వే శాఖ నిలిచింది. దీన్నిబట్టి జిల్లావాసులు ఏస్థాయిలో సమస్యలు ఎదుర్కొంటున్నారో.. ఏయే శాఖల పనితీరు ఎలా ఉన్నదో అందరికీ స్పష్టమవుతోంది. వైసీపీ పాలనలో కొనసాగిన భూ వివాదాలపైనే అత్యధిక వినతులు అందడం చర్చనీయాంశమైంది.

జిల్లా నుంచి మొత్తం 55,075 వినతులు అందాయి. ఇందులో గృహనిర్మాణశాఖకు సంబంధించి 624, వ్యవసాయశాఖ 238, సివిల్ సప్లయ్ 452, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 1,970, పంచాయతీ రాజ్ 1,326, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 409, పోలీసు 2,184, రెవెన్యూ 28,379, సెర్ప్ 362, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ 18,872 వినతులు ఉన్నాయి. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి మరో 323 వినతులు అందాయి. మొత్తం 30,741 మంది ఇళ్లకు చెందినవారు ఈ అర్జీలను అధికారులకు విన్నవించారు.

● ఇదీ పీజీఆర్‌ఎస్ నివేదిక

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వివిధ విభాగాలకు అందిన వినతులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) నివేదికను విడుదల చేశారు. ఇందులో శ్రీకాకుళం జిల్లా నుంచి అర్జీలు అత్యధికంగా ఉన్నాయి. 55,075 వినతులతో రాష్ట్రంలో సిక్కోలు ప్రథమంగా ఉంది. వినతుల విషయంలో పల్నాడు జిల్లా ఆఖరి స్థానంలో నిలిచింది. రీసర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్‌ఎస్, ప్రతీ సోమవారం 'మీ-కోసం', ఆన్‌లైన్ పోర్టల్, ప్రజావేదిక, కాల్ సెంటర్స్, జన నాయకుడు, హెచ్‌సీఎం ఎండార్స్‌మెంట్ తదితర వాటిద్వారా పలు వినతులు అందాయి. వీటితోపాటు ముఖ్యమంత్రి కార్యాలయానికి ఈమెయిల్, మంత్రి నారా లోకేశ్‌కు, అలాగే పీజీఆర్‌ఎస్‌కు ఈమెయిల్, ఉపముఖ్యమంత్రి కార్యాలయంలో, ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటనల్లో పలు సమస్యలపై స్వీకరించిన వినతులు ఎన్నో ఉన్నాయి. వాటిని శాఖలవారీగా అధికారులకు ప్రభుత్వం అప్పగించింది.

● రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ సమస్యలే..

జిల్లాలో చాలామంది రైతులు, ప్రజలు రెవెన్యూ సమస్యలతో సతమతమవుతున్నారు. పరిష్కారం దిశగా చర్యలు లేకపోవడంతో వీటిపైనే వినతులు సమర్పిస్తున్నారు. అత్యధికంగా రైతులు తమ పట్టాదారు (మిగతా 6వ పేజీలో..)



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ

జీబీఎస్ కలకలం



- వైరస్‌తో బాలుడు మృతి చెందాడని అనుమానం
- డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో గ్రామస్థులకు పరీక్షలు
- వ్యాధి లక్షణాలు నిర్ధారించాల్సి ఉందని వెల్లడి
- అంటువ్యాధి కాదని స్పష్టం చేస్తున్న వైద్యులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసలో గులియన్ బారీ సిండ్రోమ్(జీబీఎస్) వైరస్ కలకలం రేగింది. ఇటీవల గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు వాతాడ యువంత్ ఈ వ్యాధితో మృతి చెందాడని ప్రచారం జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మహారాష్ట్రలో ఈ వైరస్‌తో చాలామంది మృతి చెందగా ఇటీవల తెలంగాణలో కూడా ఆ వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో కాపుగోదాయవలసకు చెందిన యువంత్‌కు ఈ వైరస్ సోకి మృతి చెందాడన్న అనుమానంతో డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది బుధవారం గ్రామాన్ని సందర్శించారు. యువంత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి.. బాలుడికి నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరం, గొంతునొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్న వారి వివరాలను వైద్యులు సేకరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలుడు యువంత్ జీబీఎస్ వైరస్‌తో మృతి చెందాడన్న దానిపై ఇంకా నిర్ధారణ కావల్సి ఉందని డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ తెలిపారు. ఇటువంటి వ్యాధి మూడులక్షల మందిలో ఒకరికి సోకుతుందని వెల్లడించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది అంటువ్యాధి కాదని, దీనిపై ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలు 6లో

కౌన్సిలింగ్‌తో ఒక్కటై..

- దంపతుల మధ్య కొరవడుతున్న నమ్మకం
- మనస్పర్థలతో పోలీసుస్టేషన్‌ను ఆశ్రయిస్తున్న వైనం
- వివాహ బంధాల పదిలం కోసం పోలీసుల కృషి
- 13 నెలల్లో 807 కేసులకు 669 రాజీ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):

ప్రేమ వివాహాలు, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు కొన్ని మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయి. ఏడడుగులు వేసి.. కలకాలం కలిసి ఉండాల్సిన వారు.. పెళ్లయిన ఏడాదికే వివాహ బంధం విలువను మరిచిపోతున్నారు. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు గౌరవించకుండా మనస్పర్థలతో వివాహ బంధాన్ని తెంచుకునేందుకు పోలీసుస్టేషన్ల బాట పడుతున్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవ పడి.. అటు కుటుంబ పరువు, ఇటు పిల్లల భవిష్యత్ కోసం ఆలోచించకుండా.. విడిపోదామనే నిర్ణయాలకు వస్తున్నారు. తల్లిదండ్రుల నీడలో పెరగాల్సిన పిల్లలను పట్టించుకోకుండా కేసులు, కోర్టులు అంటూ వారి బాల్యాన్ని మసకబారిస్తున్నారు. భార్య భర్తల మధ్య గొడవలను పరిష్కరించాల్సిన కుటుంబ పెద్దలు ఇంట్లో లేకపోవడం, ఉమ్మడి కుటుంబాలు అంతరించుకుపోతుండటంతో చిన్నపాటి విషయాలకు పోలీసుస్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల మహిళా పోలీసు స్టేషన్లలో ఇటువంటి కేసులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులే కుటుంబ పెద్ద బాధ్యతను వహిస్తూ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ నిర్వహించి వారిని ఒక్కటి చేస్తున్నారు.

● చదువుకున్న వారే అధికం..

వరకట్న వేధింపులు... అత్తింటివారు, భర్త తనను సరిగా చూసుకోవడం లేదని భార్య.... తన మాట వినడం లేదని భర్త.. ఇలా తదితర కారణాలపై పోలీసుస్టేషన్లలో భార్యాభర్తల ఫిర్యాదులు అందుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 36 పోలీసుస్టేషన్ల ప్రతీ రోజు ఇటువంటి కేసులు నమోదవుతూనే ఉన్నాయి. వాటిని శ్రీకాకుళంలో ఉన్న మహిళా పోలీసుస్టేషన్‌కు ప్రతిపాదిస్తున్నారు. అక్కడ భార్యాభర్తలకు పోలీసులు ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. మహిళా పోలీసు స్టేషన్‌కు గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు భార్యాభర్తల మధ్య గొడవలపై 807 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ ద్వారా 669 మంది జంటలను మహిళా పోలీసులు ఒక్కటి చేశారు. అలాగే 133 కేసులు నమోదు చేశారు. గత నెలకు సంబంధించి ఐదు కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. చాలా వరకూ రాజీ కుదుర్చుతున్నా.. కొందరిలో మార్పు రాకపోవడంతో కేసులు నమోదు చేస్తున్నారు. ఇటువంటి ఘటనల్లో చదువుకున్న వారే అధిక శాతం కోర్టులను ఆశ్రయించి (మిగతా 6వ పేజీలో..)



మహిళా పోలీసుస్టేషన్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సిలింగ్ (ఫైల్)

మహిళా పోలీసుస్టేషన్‌లో కేసుల వివరాలు..

ఏడాది	నెల	ఫిర్యాదులు	ఎఫ్ఐఆర్‌లు	కౌన్సిలింగ్‌తో రాజీ	పెండింగ్
2024	జనవరి	61	11	50	0
	ఫిబ్రవరి	66	12	54	0
	మార్చి	72	16	56	0
	ఏప్రిల్	69	8	61	0
	మే	62	7	55	0
	జూన్	60	8	52	0
	జూలై	70	12	58	0
	ఆగస్టు	45	13	32	0
	సెప్టెంబరు	71	7	64	0
	అక్టోబరు	74	13	61	0
	నవంబరు	63	14	49	0
	డిసెంబరు	40	7	33	0
2025	జనవరి	54	5	44	5
	మొత్తం	807	133	669	5

ఫ్లైఓవర్.. కొలత!

- ఎట్టకేలకు రణస్థలంలో వంతెన నిర్మాణానికి సన్నాహాలు
- అస్తవ్యస్తంగా మార్కింగ్‌పై ప్రజల ఆందోళన
- బైపాస్ ఏర్పాటు చేయాలని వ్యాపారుల డిమాండ్
- సమస్యలు నివృత్తి చేయని హైవే అధికారులు

రణస్థలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):

రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. తీవ్ర తర్జనభర్జన నడుమ జాతీయ రహదారుల సంస్థ సన్నాహాలు చేస్తోంది. ఈ నెలాఖరు నుంచి పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే రోడ్డు మధ్యలో మట్టి పరీక్ష చేపడుతోంది. మరోవైపు రహదారికి ఇరువైపులా కొలతలు తీస్తూ మార్కింగ్ వేస్తోంది. కాగా.. సిబ్బంది తీస్తున్న రోడ్డు కొలతలు స్థానికుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అస్తవ్యస్తంగా మార్కింగ్ వేస్తుండడంతో తాము మరింత నష్టపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి 2016లో జాతీయ రహదారి విస్తరణకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పట్లో రోడ్డుకిరువైపులా 22.5 మీటర్లు అంటే 75 అడుగుల రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు. ఆ మేరకు షాపులు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను తొలగించారు. పరిహారం అందించినా చాలామంది బతుకులు తారుమారయ్యాయి. ఆస్తులు పోయాయి. అయితే ఇప్పుడు ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని చెప్పడంతో గతంలో సేకరించిన భూమిలోనే నిర్మిస్తారని అంతా భావించారు. కానీ 22.5 మీటర్లకు మించి కొలత చేపడుతుండడంతో అందరిలోనూ భయం వెంటాడుతోంది. గతంలోనే విలువైన స్థలాలను కోల్పోయామని.. ఎలాగోలా ఉన్నస్థలాన్ని కాపాడుకొని షాపులు, ఇళ్ల నిర్మాణాలుగా మార్చుకుంటే ఇప్పుడు మళ్లీ కొలుస్తుండడంతో కలత చెందుతున్నారు. ఒక దగ్గర 26, మరో దగ్గర 27, ఇంకోదగ్గర 37 మీటర్లు కొలుస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఫ్లైఓవర్ వద్దని, బైపాస్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు ఆందోళన చేస్తూ.. రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.



రణస్థలం వద్ద హైవే..



ఫ్లైవోవర్ కోసం రోడ్డు మధ్యలో మట్టి నమూనా పరీక్ష

వంతెన ఏర్పాటు ఇలా..

రణస్థలంలో దాదాపు 2 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ కొనసాగుతుంది. మరో 800 మీటర్ల వరకూ ఓపెన్ ఫ్లైఓవర్ నిర్మించే అవకాశం ఉంది. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలుమెట్ట తరహాలో భారీ స్తంభాలతో వంతెన ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే వంతెన నిర్మాణ పనుల కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ రావివలస సమీపంలో కొన్ని ఎకరాల లేఅవుట్‌ను అద్దెకు తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడ నిర్మాణ సామగ్రి ఉంచనున్నారు. మరోవైపు విద్యుత్ స్తంభాల మార్పు విషయంలో సంబంధిత కంపెనీ ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు.

● ఇదీ పరిస్థితి..

విశాఖ నుంచి నరసన్నపేట వరకూ దాదాపు 135 కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని ఆరు లేన్లగా విస్తరించారు. కానీ ఒక్క రణస్థలం మండల కేంద్రాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. ఇక్కడ బైపాస్ రోడ్డా?.. లేదా ఫ్లైఓవర్ నిర్మించాలా? అనే విషయమై ఏళ్ల తరబడి సందిగ్ధత కొనసాగుతోంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలం మండల కేంద్రాన్ని తప్పించి బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2016లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పటి కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు, స్థానిక ఎమ్మెల్యే కళా వెంకటరావు కృషి మేరకు... దన్నానపేట నుంచి లావేరు మండలం రావివలస వరకూ 3.5 కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణానికి నిర్ణయించారు. సుమారు 66 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. భూసేకరణ కూడా చేపట్టారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, ఎచ్చెర్లలో సేకరించిన భూములకు మాదిరిగా (మిగతా 6వ పేజీలో..)



మాఘమాసం మాటేంటి?

- ఈ నెలంతా వచ్చే భక్తులకు సౌకర్యాలేవీ?
- తాత్కాలిక ఏర్పాట్లు కూడా లేక అవస్థలు
- ఇదీ అరసవల్లి ఆలయం వద్ద పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, నాయకులు

6లో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

- 123 పోలింగ్ కేంద్రాలు
- నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరిరోజు

8లో

ఆకాశవాణి... వార్తలు వింటున్నారా?

- నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం

6లో


గత ఆదివారం మండుటెండలో క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

- ఈ నెలంతా వచ్చే భక్తులకు సౌకర్యాలేవీ?
- తాత్కాలిక ఏర్పాట్లు కూడా లేక అవస్థలు
- ఇదీ అరసవల్లి ఆలయం వద్ద పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, నాయకులు

మాఘమాసం మాటేంటి?

రథసప్తమి వేడుకలకు అట్టహాసంగా ఏర్పాట్లు చేసిన అరసవల్లి అధికారులు.. అత్యంత ముఖ్యమైన మాఘమాసం సంగతి మరచిపోయినట్టు ఉన్నారు. ఈ నెలలో వచ్చే ఆదివారల్లో ఆదిత్యుని దర్శనానికి భారీ స్థాయిలో భక్తులు వస్తుంటారు. సాధారణ రోజుల్లోనూ పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కానీ ఆ స్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పించడంపై అధికారులు శ్రద్ధ చూపించడం లేదు. క్యూలో నిల్చున్న భక్తులు ఎండలో అవస్థలు పడుతున్నా... పట్టించుకోవడం లేదు.

అరసవల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పండుగ రథసప్తమి అంగరంగ వైభవంగా ముగిసింది. ప్రత్యేక ఏర్పాట్ల పేరుతో ఆదిత్యాలయం ఎదురుగా అన్ని భవనాలను, షెడ్లను కూల్చేశారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక ఏర్పాట్లు చేసి విజయవంతంగా ఉత్సవాలను నిర్వహించారు. అక్కడితో అంతా మరిచిపోయారు. ఇది మాఘమాసం. ఆదివారాలతో పాటు సాధారణ రోజుల్లోనూ భక్తులు వేల సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకొని... మొక్కులు చెల్లించుకుంటారు. కానీ దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి సౌకర్యాలూ లేవు. కనీసం ఆదివారాల్లోనైనా ఆలయం ఎదుట తాత్కాలిక వసతులు కల్పించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

● స్నానాల గదులేవీ..

ఈ నెల 9న ఒక్కరోజే సుమారు 12 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అంచనా. రాజమ్మతల్లి పండుగలు ప్రారంభం కావడం... మాఘ ఆదివారం సూర్యునికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు ఎక్కడ నిల్చోవాలో... సేదతీరాలో తెలియని పరిస్థితుల్లో అతి కష్టమ్మీద స్వామి వారిని దర్శించుకుని బాధపడుతూ వెళ్లి పోయారు. స్వామి వారికి తలనీలాలు సమ ర్పించుకున్న వారు వందలాదిగా ఉన్నారు. కానీ వారికి స్నానాలు చేసేందుకు ఆలయ అధికారులు ఎటువంటి సదుపాయాలు కల్పించలేదు. దీంతో పుష్కరిణిలోనే స్నానాలు చేసుకోవడం గమనార్హం.

● మరుగుదొడ్లు లేవు..

సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులు తమ అవసరాల కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆలయం బయట భక్తులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇంత నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తే ఎలా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ఎండలో ఇక్కట్లు

ఈ నెల 9న స్వామివారి దర్శనానికి వచ్చిన వేలాది మంది భక్తులు ఎండలోనే క్యూలలో గంటల కొద్దీ నిల్చుని దర్శనాలు చేసుకున్నారు. తలపై రుమాళ్లు, తువ్వాళ్లు కప్పుకుని అవస్థలు పడ్డారు. ఆలయ అధికారులెవరూ కనీసం భక్తుల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. వచ్చే ఆదివారమైనా దర్శనానికి వచ్చే భక్తులకు ఎండ నుంచి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ప్రసాదం అందుబాటులో ఉంచాలి..

ఆదిత్యుని దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా ప్రసాదాలు కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం ప్రసాదాల అమ్మకం కోసం తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రసాదాలు మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉండడం లేదు. రాత్రి వరకు స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ప్రసాదాలు లేకుండా ఖాళీ చేతులతోనే నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఆలయ అధికారులు తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించి దర్శన సమయాల్లో ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

సమాచారం ఇచ్చేవారేరీ?

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొంత మంది ఆదిత్యాలయ కార్యాలయానికి ఏదో ఒక సమాచారం కోసం వస్తుంటారు. వారికి సమాధానం చెప్పేందుకు కూడా సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. ఎవరిని అడగాలో తెలియక వారు తికమకపడుతున్న సందర్భాలు అనేకం. ఆదివారాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రత్యేక పూజలు, సేవలు, అన్నదానానికి సంబంధించిన విరాళాలు తదితర వివరాల కోసం ఎవరిని సంప్రదించాలో భక్తులకు తెలియడం లేదు. ఇందుకోసం కార్యాలయ ఆవరణలో సమాచార కౌంటర్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

దర్శనానికి అవస్థలు..

గతంలో స్వామివారి దర్శనానికి వచ్చే వీవీఐపీలు, ప్రోటోకాల్ దర్శనాల భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగ కుండా ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఇరువైపులా బారికేడ్లు ఉంచడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు జరిగేవి. కానీ ఇప్పుడు పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రధాన ద్వారం వద్ద భక్తులు గుమిగూడి ఉండడం, ద్వారానికి అడ్డంగా క్యూలైన్లలో రూ.100 దర్శనాలకు భక్తులను విడిచిపెట్టడంతో ప్రోటోకాల్, వీవీఐపీ దర్శనాలకు వచ్చే భక్తులకు దర్శనం కల్పించడం సిబ్బందికి కష్టమైపోయింది. క్యూలైన్లలో భక్తులు ముందుకు నెట్టుకు రావడంతో వారిని అదుపు చేయలేక ఇబ్బందులు పడ్డారు. గతంలో లాగానే మార్గాలను ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలకు అవకాశం ఉంటుందని భక్తులు కోరుతున్నారు.

ఆకాశవాణి.. వార్తలు వింటున్నారా?



- నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం
- ఒకప్పుడు ముఖ్యమైన వినోద సాధనం

వజ్రపుకొత్తూరు/పలాస రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):


చిన్నాచారి వద్దనున్న పాత కాలపు రేడియో

ఆకాశవాణి... విశాఖపట్నం కేంద్రం... వార్తలు చదువుతున్నది కందుకూరి సూర్యనారాయణ... ఎటువంటి సమాచార వ్యవస్థ లేని అప్పటి రోజుల్లో ఈ గొంతు వినిపిస్తే.. అక్కడ వాతావరణం నిశ్శబ్దంగా మారేది. ఎవరైనా శబ్దం చేస్తే.. ఎక్కడ ఏమాట వినిపించకుండా పోతుందోనని శ్రోతలు అప్రమత్తంగా ఉండేవారు. కొన్ని గ్రామాలలో గ్రామచావిడులు... పంచాయతీ కార్యాలయాల వద్ద గుమిగూడేవారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలలో ఒకటి, రెండు పెద్దల ఇళ్లలో మాత్రమే రేడియోలు ఉండేవి. చిన్న సైజ్ పెట్టెల్లో ఉండే ఆ రేడియోలకు ఏంటెన్నాలు కూడా ఉండేవి. ఉదయాన్నే సుప్రభాతంతో ప్రారంభమయ్యే ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం కార్యక్రమాలు.. కథలు, నాటికలు, పాడి-పంట, సినిమాలు, పాటలు, హరి కథలు, వార్తలతో ప్రజలను ఎంతోగానో అలరించేవి. ఉదయ రాగాలు పేరుతో ఉదయాన్నే సామాన్య కుటుంబాలలో జరిగే కార్యక్రమాలపై హస్యభరితంగా ప్రసారమయ్యే కార్యక్రమం బహుళ ప్రజాదరణ పొందింది. ముఖ్యంగా ఆదివారం ఉదయం తెలుగు సినిమాలను సంక్షిప్తంగా ప్రసారం చేసేవారు. అది కూడా రెండు, మూడు భాగాలుగా. ఆ సినిమా డైలాగులు వినేందుకు శ్రోతలు ఎదురు చూసేవారు. వివిధ భారతిలో కొత్త సినిమాల పాటలు.. డైలాగులు వినిపించేవి.

చిన్నప్పటి నుంచి రేడియో అంటే ఇష్టం..



చిన్నప్పటి నుంచి రేడియో కార్యక్రమాలంటే మహా పిచ్చి. మా నాన్న రైల్వేలో ఉద్యోగం చేసేవారు. అసోంలోని అటవీ ప్రాంతంలోకి రైల్వే పనులపై వెళ్లేటపుడు తన వెంట తప్పనిసరిగా రేడియో తీసుకొని వెళ్లేవారు. అతని అలవాటే నాకూ వచ్చింది. చిన్నప్పటి నుంచి ఫిలిప్స్ రేడియో మా ఇంట్లో ఉండేది. రేడియోలో వచ్చిన కార్యక్రమాలన్నీ ఆసక్తిగా వినేవాడిని. సిలోన్ స్టేషన్ నుంచి వచ్చే కార్యక్రమాలు అంటే మరీ ఇష్టం. ఆ తరువాత సీఆర్‌పీఎఫ్‌లో మెస్‌లో ఉద్యోగం వచ్చింది. అప్పుడు కూడా మెస్‌లో రేడియో కార్యక్రమాలు వినే వాళ్లం. రెండేళ్ల క్రితం వరకు రేడియో కార్యక్రమాలు వినేవాడి ని. ఉద్యోగ విరమణ చేసిన తరువాత టీవీ, సెల్‌ఫోన్‌లో కార్య క్రమాలకు అంకితమవడంతో రేడియోకు దూరమయ్యాను.

-సానా వెంకటేశ్వరరావు, చినవంక, వజ్రపుకొత్తూరు మండలం

రేడియో దూరమాయే!

కమ్మని కబుర్లు చెప్పే ఆత్మీయ నేస్తం.. సినిమా పాటలతో ఖైమరిపించే ఆనందవాణి.. ప్రపంచవ్యాప్తంగా జరిగే సంఘటనలను వార్తల రూపంలో అందించే ఆకాశవాణి...అదే రేడియో ఇప్పు డు కనిపించడం లేదు. ఉదయాన్నే సుప్రభాతంతో నిద్రలేపి.. సాయంత్రం జనరంజకంగా పలకరించి.. రాత్రి కమ్మని పాటలతో ఆహ్లాదపరిచే తొలి తరం సమాచార మాధ్యమం రేడియో. కానీ ఇప్పటి తరానికి దీని గురించి తెలిసింది అంతంత మాత్రమే. ప్రస్తుతం రేడియో వినియోగం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. కాకపోతే ప్రముఖ నగరాల్లో ఎఫ్‌ఎం రేడియోలు మాత్రం సందడి చేస్తున్నాయి. డిజిటల్, సోషల్ మీడియా దాటికి అన్నిరకాల మాధ్యమాలు పడిపోయాయి. రేడియోదీ అదే పరిస్థితి. అప్పట్లో ప్రతి ఇంట్లో రేడియోలు దర్శనమిచ్చేవి. కానీ ఇప్పుడు మచ్చుకైనా చూస్తామంటే దొర కడం లేదు. అప్పట్లో అత్తవారి లాంఛనాల్లో రేడియోకు కూడా స్థానం ఉండేది. కానీ ఆ ప్రసారాలపై ఇప్పుడు అంతగా ఎవరూ ఆసక్తి చూపుతుండడం లేదు.

సినిమా పాటలతో ఎంతో ఆనందం..



నాటి కాలంలో ఎటువంటి మాధ్యమాలు లేని సమయంలో రేడియోలో వచ్చే సినిమా పాటలు ఎంతో ఆనం దాన్నిచ్చేవి. నా 12వ ఏట నుంచి రేడియో వినడం మొదలుపెట్టాను. మా గ్రామంలో ఓ రెండిళ్లలో మాత్రమే రేడియోలు ఉండేవి. అప్పట్లో శ్రీకృష్ణ పాండవీయం, ఉమ్మడి కుటుంబం, పూలరంగడు, పర మానందయ్య శిష్యుల కథ, ప్రేమ్‌నగర్, దసరాబుల్లోడు వంటి సినిమాల మధుర గీతాలు అనే కార్యక్రమం రాత్రి 7.30 గంటల నుంచి అరగంట పాటు వచ్చేది. ఆ పాటలను వినాలనే తలంపు తో ఎక్కడ ఉన్నా.. ఆ సమయానికి ఆ ఇళ్ల వద్దకు చేరుకునే వాళ్లం. పెద్దవాళ్ల నాటి వార్తలను వింటుంటే... మేం సినిమా పాటల కోసం తాపత్రయ పడేవాళ్లం. ఒక్కోసారి సరైన నెట్‌వర్క్ లేకపోవడంతో రేడియో పలికేది కాదు. ప్రస్తుతం ఉన్న మాధ్య మాల కన్నా రేడియోనే నాకు ఇప్పటికీ ఆనందాన్ని ఇస్తోంది.

-కె.చిన్నాచారి, లొద్దభద్ర, పలాస మండలం

జీబీఎస్ కలకలం

- సంతబొమ్మాళి మండలంలో అనుమానిత కేసు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)

గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) అరుదైన వ్యాధి. సంతబొమ్మాళి మండల పరిధిలో పదేళ్ల బాలుడు ఈ వ్యాధి లక్షణాలతో ఇటీవల మరణించాడనే ప్రచారంతో... కలకలం రేగుతోంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమై బుధవారం ఆ గ్రామంలో పర్యటించింది. బాలుడి తల్లిదండ్రులను ఆరా తీసింది. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారు. అయితే ఇది అంటు వ్యాధి కాదని, భయపడాల్సిన అవసరం లేదని దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.బి.సుధీర్ చెబుతున్నారు. కాపుగోదాయవలసలో వాతాడ యువంత్ (10) అనే బాలుడు ఈ వ్యాధితో మృతి చెందాడనే అనుమానంతో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఇటువంటి వ్యాధి ఐదు లక్షల మందిలో ఒకరికి వస్తుందని తెలిపారు. శరీరంలో సోకిన ఇన్‌ఫెక్షన్ రోగిని కృంగదీస్తుందన్నారు. ముందుగా గొంతు నొప్పి, దగ్గు, డయేరియా, జ్వరంతో ప్రారంభమవుతుందని తెలిపారు. శరీర కణజాలాలను నిర్వీర్యం చేసి ఊపిరి ఆడకుండా చేస్తుందని తెలిపారు. దీనిపై గ్రామంలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇంకా ఎవరికైనా ఇటువంటి లక్షణాలు ఉన్నాయేమోననే విషయమై గ్రామంలో వైద్య సిబ్బందితో సర్వే చేశామని వివరించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఇద్దరు చిన్నపిల్లల వైద్య నిపుణులు ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారని ఆయన తెలిపారు. పరిశుభ్రత పాటించాలని సూచించామన్నారు. ఈ వ్యాధిని గుర్తించడానికి మూడు రకాల వైద్య పరీక్షలు చేయాల్సి ఉందని వివరించారు. ఒక్క రకం వైద్య పరీక్ష మాత్రమే చేసినందున యువంత్ ఈ వ్యాధితో మృతి చెందాడని నిర్ధారణకు రాలేకపోతున్నామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో వైద్య పరీక్షలు చేశామని వైద్యాధికారి సుధీర్ తెలిపారు.

నరాల పనితీరుపై ప్రభావం..

ఈ వ్యాధి వస్తే నరాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. నరాల బలహీనత, తిమ్మిర్లు, కొన్నిసార్లు పక్షవాతానికి కారణమవుతుంది. చేతులు, కాళ్లు బలహీనమవుతాయి. ఈ వ్యాధి సోకడానికి గల కచ్చితమైన కారణాలను వైద్యులు గుర్తించలేకపోతున్నారు. మూడింట రెండొంతుల మందికి సంక్రమణ లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్, కొవిడ్-19 లక్షణాలైన గొంతు నొప్పి, జ్వరం, తల నొప్పి, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో పాటు ఊపిరితిత్తుల పైన ప్రభావం చూపుతుంది. జీర్ణాశయానికి సంబంధించిన ఇబ్బందులు తలెత్తుతాయి. తరచుగా కాళ్లు, పాదాల్లో జలదరింపు ఉంటుంది. శరీరం, చేతులకు వ్యాపిస్తుంది. నడవడం, బరువులు ఎత్తడం కష్టమవుతుంది. కొంతమందికి చేతులు, ముఖంలో ముందుగా ఈ లక్షణాలు కనిపిస్తాయి. చేతి వేళ్లు, కాలి వేళ్లు, చీలమండలు (మణికట్టు)లో సూదులతో గుచ్చినట్లు ఉంటుంది. శరీరమంతా బలహీన పడుతుంది. సరిగా నడవలేకపోవడంతో పాటు మెట్లు ఎక్కేందుకు ఇబ్బందులు పడతారు. మాట్లాడడం, నమలడం (మింగడం) వంటి పనులు చేయలేకపోవడం, ప్రేవుల పని తీరులో సమస్యలు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, రక్త పోటులో తేడా (ఎక్కువ, తక్కువ) ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. సాధారణంగా లక్షణాలు కనిపించిన రెండు వారాల లోపే నిస్సత్తువ ఆవరిస్తుంది.


గ్రామస్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

ఏం చేయాలంటే..

కాలి వేళ్లలో తేలికపాటి జలదరింపు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. అత్యవసర సహాయం తీసుకోవాల్సిందే. ఈ వ్యాధి బారిన పడిన వారికి చికిత్సకు కొంత సమయం పడుతుంది. కోలుకోవడానికి నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు. కొంతమందికి మూడేళ్లు పట్టవచ్చు. చిన్నపిల్లలకు ఈ వ్యాధి అరుదుగా వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారిలో పెద్దల కంటే పిల్లలు తొందరగానే కోలుకుంటున్నారని వైద్యవర్గాల మాట. ఒత్తిడిని తగ్గించుకోవడం, సంతులిత ఆహారం తీసుకోవడం, వ్యాయామం, జీవనశైలిలో మార్పులతో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకోవడం ద్వారా దీని బారిన పడకుండా ఉండొచ్చు.

వెంటనే వైద్యులకు చూపించాలి..



జీబీఎస్‌తో పాదాల నుంచి చేతుల వరకు వణుకు వస్తుంది. నడవ లేరు. కూర్చోవడమూ కష్టమవుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులకు చూపించాలి. నరాలపైన ప్రభావం చూపే వ్యాధి కావడంతో రోగ నిరోధక శక్తికి సంబంధించిన వైద్యం అందిస్తారు. ఈ వ్యాధి కారణంగా ఇన్‌ఫెక్షన్‌కు గురైన అవయవాలకు వైద్యం అందిస్తారు. ఎక్కువగా 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు వారు దీని బారిన పడుతున్నారు.

-డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, జనరల్ సర్జన్, ఎస్.కోట

ఫ్లై'ఓవర్'.. కొలత!

(ఐదో పేజీ తరువాయి)

పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్ ధర ప్రకారం సెంటు భూమికి రూ.2 లక్ష లకుపైగా చెల్లిస్తామని ప్రకటించారు. కానీ అప్పట్లో విపక్షంగా ఉన్న వైసీపీ నేతలు ఈ పరిహారం చాలదని, పెంచాలని డిమాండ్ చేశారు. అయితే మిగతా ప్రాంతాల్లో రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టిన హైవే అథారిటీ అధికారులు రణస్థలంలో పెండింగ్ పెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిహారం విషయంలో మాట మార్చారు. సెంటుకు మొదటి అనుకున్నంత ధర ఇవ్వలేమని 30 శాతం తగ్గించి ఇస్తామని ప్రకటించారు. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత ప్రారంభమైంది. బైపాస్ నిర్మించాలంటే దాదాపు ఐదుచోట్ల వంతెనల నిర్మాణం చేపట్టాలి. రైతులకు పరిహారం చెల్లించాలి. ఈ మొత్తం లెక్కలు వేసుకున్న హైవే అథారిటీ అధికారులు మాత్రం మండల కేంద్రంలో ఫ్లైఓవర్ నిర్మాణానికే మొగ్గు చూపారు. అప్పటికే రైతుల నుంచి సేకరించిన 66 ఎకరాలను తిరిగి వారికి అప్పగిస్తూ ప్రభుత్వం సైతం ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఇప్పుడు కొలతల విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● చాలా భయం వేస్తోంది..

ఫ్లైఓవర్ నిర్మాణానికిగాను వేస్తున్న కొలతలు చూస్తుంటే భయం వేస్తోంది. గతంలోనే రోడ్డు విస్తరణలో విలువైన ఆస్తులను కోల్పోయాం. ప్రభుత్వం పరిహారం ఇచ్చినా అది ఏ మూలకు చాలలేదు. ఇప్పుడిప్పుడే ఎలాగోలా బయటపడ్డామనుకుంటే.. ప్రస్తుతం ఇళ్లు, షాపులను దాటించి కొలతలు వేస్తున్నారు.

-గాజుల భాస్కరరావు, స్థానికుడు, రణస్థలం

● అంత వ్యత్యాసమా?

కొలతల్లో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఒకచోట 26 మీటర్లు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల 37 మీటర్లు తీస్తున్నారు. అలా ఎందుకని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. కనీసం అక్కడ ఉండేవారు నోరు మెదపడం లేదు. ఉన్నతాధికారులు చెప్పిన విధంగా తాము చేసుకొని వెళుతున్నామని మాత్రమే చెబుతున్నారు.

-చుక్క శ్రీను, స్థానికుడు, రణస్థలం

● హైవే అధికారులు లేరు..

హైవే అధికారులు లేకుండా.. దిగువస్థాయి సిబ్బందితో సర్వే చేయిస్తున్నారు. అటు రెవెన్యూ కీలక అధికారులు సైతం కనిపించడం లేదు. కేవలం సచివాలయ సిబ్బందితో కొలతలు తీయడం ఏమిటి. ఇంతటి భారీ ప్రాజెక్టు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు పట్టించుకోవాలి.

-ఇడదాసుల తిరుపతిరాజు, స్థానికుడు, రణస్థలం

కౌన్సిలింగ్‌తో ఒక్కటై..

(ఐదో పేజీ తరువాయి)

విడాకులు తీసుకుంటున్నారని గణాంకాలు చెబుతున్నాయి.

● మహిళా పోలీసుస్టేషన్‌లో ప్రతీ మంగళవారం, శుక్రవారం భార్యాభర్తలకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ కౌన్సిలింగ్‌లో ఇద్దరు న్యాయవాదులు, రిటైర్డ్ ఎస్ఐ స్థాయి అధికారి, ఒక సీనియర్ సిటిజన్, ఐసీడీఎస్ మహిళా సిబ్బంది, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్ఐలు, మహిళా పోలీసులు.. భార్యాభర్తలతో మాట్లాడుతారు. వారి గొడవలకు కారణాలు తెలుసుకుంటారు. అనంతరం ఆ సమస్యను పరిష్కరించే దిశగా కౌన్సిలింగ్ నిర్వహించి వివాహ బంధం గొప్పతనాన్ని వివరిస్తారు. సమస్య ఆధారంగా నాలుగైదు సార్లు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడతారు. ఇలా 95 శాతం మంది భార్యాభర్తలను కలుపుతూ జిల్లాలో ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కి మహిళా పోలీసుస్టేషన్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

● అందరూ ఉన్నా అనాథలుగా...

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో పోలీసు స్టేషన్లను ఆశ్రయించి కోర్టుల్లో విడాకులు తీసుకుంటుండటంతో అందరూ ఉన్నా పిల్లలు అనాథలుగా మారుతున్నారు. తండ్రి సంరక్షణలో, తల్లి ఆప్యాయత,ప్రేమానురాగాల మధ్య పెరగాల్సిన పిల్లలు మానసికంగా కుంగిపోతున్నారు. పోలీసుస్టేషన్లలో తల్లిదండ్రులు గొడవపడటం చూస్తూ పిల్లలు కన్నీరు పెడుతుండటం చుట్టు పక్కల వారిని కలచివేస్తున్నా కొంతమంది దంపతుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని.. భార్యాభర్తలు సఖ్యతగా మెలగాలని పోలీసులు సూచిస్తున్నారు.

వీలైనంత వరకు కలిపేలా చూస్తున్నాం..



పోలీసుస్టేషన్‌కు వచ్చే భార్యాభర్తలకు మొదట కౌన్సిలింగ్ ఇచ్చి కలిపేలా చూస్తున్నాం. లేదంటే కేసులు నమోదు చేస్తున్నాం. చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తున్నవారే విడాకులు కావాలనుకుంటున్నారు. జిల్లాలో అధిక శాతం గ్రామీణ ప్రాంత మహిళలు వరకట్న వేధింపులు, తాగుబోతు భర్తలు, అత్తమామల వేధింపుల తాలూకే ఫిర్యాదు చేస్తున్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం, తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడిన వారు, విదేశాల్లో అల్లుడు కావాలనుకునే వారే ఎక్కువగా మోసపోతూ మహిళా పోలీసుస్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రతీ మహిళా చట్టాలపై అవగాహన కలిగి, 23 ఏళ్లకు వివాహం చేసుకోవాలి. ప్రతీ కళాశాల, పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం.

-టి.త్రివేణి, సీఐ, మహిళా పోలీసుస్టేషన్

సగానికిపైగా రెవెన్యూవే!

(ఐదో పేజీ తరువాయి)

పాసుపుస్తకాలను.. భూవివరాల మ్యుటేషన్ను, సర్వే సెటిల్‌మెంట్స్ భూ రికార్డులలో విస్తీర్ణం సరిగా నమోదుకాకపోవడం... వాటిని సరిచేయాలంటూ పలుమార్లు అర్జీలు ఇస్తున్నారు. ఆశించినస్థాయిలో పరిష్కారం లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ శాఖల సమస్యలను పరిష్కరించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది.

ప్రజల సంతృప్తి.. సీఎంఓ అసంతృప్తి..

అర్జీల పరిష్కారం వంటి అంశాలకు సంబంధించి అర్జీదారుడు సంతృప్తి వ్యక్తం చేసినా.. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)నుంచి అసంతృప్తిగానే ఉంది. పోలీస్ డిపార్ట్‌మెంట్, సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్, జల వనరులు, మునిసిపల్ డిపార్ట్‌మెంట్, సీసీఎల్ఏ.. వీటన్నింటిపై సీఎంఓ కార్యాలయం 40 శాతం మాత్రమే సంతృప్తి వ్యక్తం చేసింది. పరిస్థితి మరింత మెరుగవ్వాలని నివేదిక చెబుతోంది. జిల్లాలో భూ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అంతటా భూ వివాదాలు, ఆక్రమణలు.. అక్రమాలే. వాటన్నింటినీ సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏదిఏమైనా జిల్లా నుంచి అర్జీలు సంఖ్య తగ్గాలంటే రెవెన్యూ సర్వే సెటిల్‌మెంట్ శాఖలపై నేరుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టి సారిస్తే ఫలితముంటుంది.

దోమల నివారణకు చర్యలు

● 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి స్పందించిన అధికారులు



హౌసింగ్ బోర్డు కాలనీలో దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 29, 30వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో దోమల నివారణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు తమ ప్రాంతంలో దోమల సమస్య అధికంగా ఉందని పరిష్కారం చూపాలని కోరారు. ఇందులో భాగంగా నగరపాలక హెల్త్‌అధికారి సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం యాంటీ లార్వా (ఏఎల్‌వో) మందును స్ప్రే చేయించారు. బెహరా మనోవికాస కేంద్రం, న్యూ టీపీఎం స్కూల్, కర్లపువీధి, రాధాకృష్ణనగర్, ఉడా పార్క్ ఏరియా, మావూరి వీధి, కలెక్టర్ బంగ్లా సమీప కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా హెల్త్ అధికారి సుధీర్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి సూచనల మేరకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు తొలి ప్రాధాన్యం ఇస్తూ క్రమ పద్ధతిలో సమస్యలు పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు అనిల్, శ్రీనివాస్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

గార, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శాలిహుండం వద్ద ప్రసిద్ధ శ్వేతగిరిపై గల వేణుగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అర్చకులు మహీంద్రాడ రవికుమార్, ఇతర అర్చక బృందం వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ దంపతులు, వైద్యులు కింజరాపు శ్రీనివాసులు నాయుడు దంపతులు, న్యాయాధికారి కొంక్యాన సుభాష్ దంపతులు పాల్గొని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ సుగ్గు మధురెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీ నరసింహదేవి దంపతులు, రిటైర్డు ఏఈ పల్లి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కుంభ సంక్రమణం పూజలు



అలంకరణలో స్వేచ్ఛావతి అమ్మవారు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కుంభ సక్రమణం పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేకువ జాము నుంచి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, సింధూర మర్ధన పూజలు చేశారు. అనంతరం సహస్ర నామార్చన, హోమాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో రెండువేల మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు. గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ, చిదంబరేశ్వర, మండపల్లి గారపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు.



కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో బుధవారం మాఘ పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు జరిపించారు.

రిమ్స్‌లో అన్నపూర్ణ సేవకు విరాళం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన అన్నెపు విశ్వనాథం రూ.10వేలు, శ్రీకాకుళం పట్టణానికి చెందిన కవిత రూ.10 వేలు చొప్పున రిమ్స్‌లో నిర్వహిస్తున్న సత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవకు విరాళంగా బుధవారం అందచేసినట్టు సంస్థ అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. దాతలను రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు, రిమ్స్ అన్నపూర్ణ ట్రస్ట్ అధ్యక్షుడు గంగుల రమణబాబు అభినందించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే నగరసుందరీకరణ సాధ్యపడుతుందని ఆ దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని నగర పాలక కమిషనర్ వీవీవీ ప్రసాదరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు పారిశుధ్యం, పరిసరాల శుభ్రత ఆవశ్యకతపై కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు గార మండల సమావేశం

గార, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గార మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేది శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని, ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎన్ఈఆర్



మంత్రి గడ్కరీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఢిల్లీలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోకవర్గంలో రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయించాలని విన్నవించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఉన్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసులు ఛేదించాలి: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సమగ్రమైన దర్యాప్తుతో ప్రాపర్టీ కేసులు త్వరితగతిన ఛేదించి, రికవరీ శాతాన్ని పెంచాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, అందువల్ల గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన దొంగతనాలు, పెండింగ్ కేసులపై ఎస్పీ ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో భాగంగా ఇటీవల జైలు నుంచి విడుదలైన నేరస్తుల కదలికలు, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను ఛేదించాల న్నారు. ముఖ్యంగా మహిళలపై జరిగిన దాడి కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెట్రోలింగ్, రాత్రి గస్తీ పటిష్టంగా నిర్వహించాలని, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేయాలన్నారు. సమావేశంలో సీఐలు శ్రీనివారావు, శ్రీనివాస్, ఎస్ఐలు కోటేశ్వరరావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కారుణ్య నియామకపత్రం అందజేత

అనారోగ్యంతో ఈ ఏడాది మరణించిన హోంగార్డు శ్రీనివాసరావు భార్య కె.ఉదయకుమారికి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కారుణ్య నియామకపత్రాన్ని అందజేశారు. అలాగే ఇటీవల మరణించిన మరో హోంగార్డు ఎం.గోవిందరావు సతీమణి నాగరత్నమ్మకు తోటి హోంగార్డుల ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4.06లక్షలు చెక్కును ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీవో ఏవో సీహెచ్ గోపినాథ్, ఆర్ఎస్ఐ వెంకటరమణ, క్లర్క్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూర్టీ ఫోర్సు (సీఐఎస్ఎఫ్)లో కానిస్టేబుల్ (డ్రైవర్/పంప్ ఆపరేటర్) ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవింగ్ పోస్టుకు పదో తరగతి/ మెట్రిక్ ఉత్తీర్ణత సాధించి, డ్రైవింగ్ లైసెన్సు కలిగినవారు, పంప్ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా (పాలిటెక్నిక్) చదివిన పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు సీఐఎస్ఎఫ్ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పరామర్శ

ఆమదాలవలస, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు కుద్దిరాం గ్రామానికి చెందిన డీలర్, వైసీపీ నాయకుడు సాధు చిరంజీవి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను వైసీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్‌తో పటు పార్టీ క్యాడర్ అంతా బుధవారం పరామర్శించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, నాయకులు డి.చిరంజీవి, సాధు కామేశ్వరరావు, పొడుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

గుజరాతీపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చేరువలో అంపోలు రోడ్డులోగల జిల్లా జైలును సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు బుధవారం సందర్శించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని, వారు బెయిల్ పిటిషన్లు ఇప్పటి వరకు పెట్టిన దరఖాస్తులను తీసుకున్నారు. జైలులో ఉన్న ముద్దాయిలకు మెడికల్ టెస్టులు చేయించి, వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఆహారం, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం ఆదిలింగం, జైలర్ దివాకర్ నాయుడు, ప్రిజన్ ప్రోగ్రామర్ పి.దేవి పాల్గొన్నారు.

'తండేల్' సక్సెస్ మీట్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత బన్నీ వాసు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో 13వ తేది గురువారం సాయంత్రం తండేల్ చిత్ర యూనిట్ సందడి చేయనున్నట్టు చిత్ర నిర్మాత బన్నీ వాసు తెలిపారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో నిర్మాత బన్నీ వాసు మాట్లాడుతూ.. సిక్కోలు మత్స్యకారులకు సంబంధించిన ఓ యదార్థ గాధ ఆధారంగా తెరకెక్కించిన తండేల్ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చిత్ర సక్సెస్ మీట్‌ను శ్రీకాకుళంలోనే చేయాలని నిర్ణయించామన్నారు. ఈ సక్సెస్ మీట్‌కు తక్కువ సమయం ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ సక్సెస్ మీట్‌కు చిత్ర హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో చిత్ర కథా రచయిత కార్తీక్ తీడ పాల్గొనగా, నిర్మాత, రచయితలను అక్కినేని అభిమాన సంఘం ప్రతినిధులు గురుచరణ్, సంతోష్ పుష్పగుచ్ఛం అందించి గజమాలతో సత్కరించారు.

పంట నమోదు సక్రమంగా చేపట్టాలి



పంటలను పరిశీలిస్తున్న జేసీ, వ్యవసాయాధికారులు

పొందూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రబీసాగులో వ్యవసాయ సిబ్బంది పంట వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ అన్నారు. తోలాపి, కనిమెట్ట గ్రామాల్లో సూపర్‌చెక్‌లో భాగంగా పలు పంటలను జేసీ పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటల వివరాలు సేకరించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందాలంటే పంట నమోదు వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఏడీ శ్రీనివాసరావు, ఏవో బి.బాబ్జి, రైతులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి



పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

జి.సిగడాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గెడ్డకంచరాం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని గ్రామానికి చెందిన సర్పంచ్, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాల గేట్ వద్ద విద్యార్థులతో కలిసి వారి తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 153 మంది విద్యార్థులు చదువుతున్నారని, 6 నుంచి 8వ తరగతి వరకు 70 మంది విద్యార్థులు ఉన్నారని, అందువల్ల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పరిసర గ్రామాలైన శేతభీమవరం, పెనసాం విద్యార్థులు ఇక్కడ చదువుకొనేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షలతో ప్రయోజనం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ముందు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. బుధవారం బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్.దేవరాజ్ పాల్గొన్నారు.

వీధిలైట్ల మరమ్మతులు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి 17వ వార్డు గిరిజనవీధిలో విద్యుత్ లైట్లు పాడవడం, కొళాయి ట్యాప్‌లు విరిగిపోవడంతో టీడీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జి జన్నెల సంతోష్ తన సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. బుధవారం ఉదయం నుంచి వార్డులో పాడైన లైట్లు మార్చడంతో పాటు వీధిలోగల పలు సమస్యలు పరిష్కరించారు.

పథకాలు వినియోగించుకోవాలి

సోంపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఉద్యాన శాఖ అధికారిణి మాధవీలత అన్నారు. బుధవారం మామిడిపల్లి, సిరిమామిడి గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి పథకాలపై వివరించారు. కొబ్బరి చెట్లకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకులు శైలజ, సుధారాణి, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి సోమేష్ పాల్గొన్నారు.

బాలల రక్షణకు చర్యలు తీసుకోండి

కవిటి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణకు గ్రామస్థాయిలో చర్యలు తీసుకోవాలని మిషన్ వాత్సల్య జిల్లా బాలల రక్షణ విభాగం సోషల్ వర్కర్ డి.మధురమీనాక్షి అన్నారు. కవిటిలోని మండలమహిళా సమాఖ్య భవనంలో బుధవారం మహిళ సంఘాల సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ గ్రామంలో కమిటీలు ఏర్పాటుచేసి నెలవారీ సమావేశాలు జరపాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం గోవింద్, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

పంట మార్పిడి చేసుకోవాలి

జి.సిగడాం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో పంట మార్పిడి తప్పని సరిగా చేసుకోవాలని శాస్త్రవేత్తలు అనూష, జీవీఎస్ రోయ్ కోరారు. బుధవారం చెట్టుపొదిలాంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవంతో పాటు పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలువురు రైతులు నూతన పద్ధతుల్లో సాగుచేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఏవో ఎర్రా శారద తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కొండపోలమ్మ కాలనీకి చెందిన ప్రతిభా త్రిపాఠి దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ సభ్యులు బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. వీరి కొడుకు చనిపోవడంతో వీరు రోడ్డున పడ్డారు. కార్యక్రమంలో ధనుష్‌రంగా, రాజ్‌కుమార్, నరేంద్ర పాల్గొన్నారు.


ధర్నా విజయవంతం చేయాలి

ఆమదాలవలస, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు ఈ నెల 17న జిల్లా కేంద్రంలో చేపటనున్న ధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘ కార్యదర్శి పి.భూలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో సీడీపీవో అనురాధను కలిసి నోటీసు అందించారు. కార్యకర్తలు కె.కృష్ణవేణి, కె.సునీత, జి.భారతి, ఎస్.ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యాన్ని అమ్మితే చర్యలు

సోంపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన ధరలకు మాత్రమే మద్యాన్ని విక్రయించాలని సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.బేబీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇటీవలే సవరించిన ధరలు ఈనెల 11 నుంచి అమలులోకి వచ్చాయని తెలిపారు. అలాగే 20లీటర్ల సారాతో మందస మండలం బుడారు సింగికి చెందిన నెయ్యి కేశవరావు, బెట్టకోల గ్రామానికి చెందిన సవర భీమారావు, బహడాపల్లి గ్రామానికి చెందిన రత్నాల శకుంతల సారాతో పట్టుబడినట్టు ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

ఆయన నేత్రాలు సజీవం



శ్రీనివాస్ (ఫైల్)

గుజరాతీపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని హయతినగర్‌లో నివాసముంటున్న పొట్నూరు శ్రీనివాస్ (61) బుధవారం మృతిచెందారు. అతడి నేత్రాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు పర్యవేక్షణలో మంగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా అతడి కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

వర్సిటీ అభివృద్ధికి సహకరించాలి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కెమధుమూర్తిని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని కోరారు. మంగళగిరిలోని మండలి కార్యాలయంలో ఛైర్మన్‌ను వీసీ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బోధన, పరిశోధన, పరిపాలనా కార్యక్రమాలకు సహాయం అందించాలని కోరినట్టు వీసీ చెప్పారు.

ఆర్టీసీ కార్యాలయంలో రక్తదానం

అరసవల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రహదారి, భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. డీపీటీవో ఎ.విజయ్‌కుమార్, డిపో మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ, పీఆర్‌వో సుమన్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి అమానుషం

రణస్థలం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి అమానుష మని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పురో హిత బ్రహ్మణ సమాఖ్య శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మేడూరి కృష్ణశర్మ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘట నలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నిషేధించినా.. నిబంధనలు బేఖాతర్

● బాహుదా వంతెనపై నుంచి యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణానికి ఆనుకుని ఉన్న బాహుదానది వంతెనపై భారీ వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఏడాదిన్నర కిందట వంతెన సగభాగం కూలిపోవడంతో భారీ వాహనాల రాకపోకలు నిషేధించిన విషయం విదితమే. అయినా నిబంధనలు బేఖాతర్ చేస్తూ నిర్వాహకులు పగలు రాత్రి తేడా లేకుండా భారీ వాహనాలను తరలిస్తున్నారు.

పట్టణానికి ఆనుకుని ఉన్న బాహుదా వంతెన ఏడాదిన్నర కింద వంతెన సగభాగం కూలిపోయింది. దీంతో తాత్కాలికంగా వంతెన నిర్మించారు. ఈ నేపథ్యంలో భారీవాహనాలు రాకపోకలను పూర్తిగా నిషేధించారు కార్లు, ఆటోలు వంటి చిన్న చిన్న వాహనాలను మాత్రమే అనుమతిఇచ్చారు. కాని నిబంధనలకు విరుద్ధంగా లారీలు వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇరుగ్గా ఉండడంతో ఎదురుగా భారీ వాహనం వచ్చిపోయే సమయంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనకావడంతో అధిక బరువుగల వాహనాలు వచ్చిపోతుండడంతో ఏక్షణంలో మిగిలిఉన్నవంతెన కూలిపోతుందోనని పట్టణవాసులు భీతిల్లుతున్నారు. లారీలు, భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వంతెన ఊగుతోం దని ఉపాధ్యాయుడు మురళీధర్ తెలిపారు. తక్షణమేపోలీసులు,ఆర్అండ్‌బీ అధికారులు భారీ వాహనాలు వంతెన మీదుగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ద్విచక్రవాహనచోదకులు, పట్టణప్రజలు కోరుతున్నారు.కాగావంతన గుండా భారీ వాహనాల రాకపోకలకు అనుమతిలేదని సీఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. తక్షణమే భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



శిథిలావస్థలో ఉన్న వంతెనపై నుంచి వెళ్తున్న లారీ

ప్రభుత్వాలు మారినా.. పనులు పూర్తి కాక

● పునాదులు దాటని వైనం ● కార్యాలయం లేక కార్యకలాపాలకు అవస్థలు ● ఇదీ పొందూరులోని ఎంఎంఎస్ భవనం పరిస్థితి



పునాదుల్లో నిలిచిపోయిన భవనం పనులు

పొందూరు,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):పొందూరులోని మండల మహిళా సమాఖ్య (ఎంఎంఎస్) భవనం పనులు దశాబ్దన్నర కాలంగా ప్రభుత్వాలు మారుతున్నా పూర్తికావడంలేదు. ఈ నేపథ్యంలో సొంత భవనం లేకపోవడంతో ఎంఎంఎస్ కార్యకలాపాలకు అవస్థలకు తప్పడం లేదు.

మహిళా సంఘాలను సమన్వయ పరిచేందుకు మండల మహిళా సమాఖ్య పనిచేస్తోంది. ఇక్కడ దశాబ్దాలు గడుస్తున్నా ఎంఎంఎస్ కార్యాలయానికి సొంతభవనం నిర్మాణానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో 2012లో స్త్రీశక్తి భవనానికి రూ.25 లక్షలతో నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే బి.సత్యవతి శంకుస్థాపన చేశారు.అయితే నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు ముందుకుసాగలేదు.ఈనేపథ్యంలో2019 జనవరి11న టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు.ఈమేరకు రూ.40 లక్షలు మంజూరయ్యాయని పేర్కొని పనులు సైతం ప్రారంభించారు. పునాదులు సైతం వేశారు. ఇంతలోజరిగిన ఎన్నికల్లో వైసీపీప్రభుత్వం విజయం సాధించింది. టీడీపీ ప్రభుత్వహయాంలో ప్రారంభమై 10 శాతంలోపు జరిగిన పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపి వేయాలని నిర్ణయించడంతో ఎంఎంఎస్‌భవనపనులు నిలిచిపోయాయి. ఐదేళ్లఎమ్మెల్యే, స్పీకర్‌గా వ్యవహరించిన తమ్మినేని సీతారాం భవనం నిర్మాణం పూర్తిచేయడానికి చర్యలు తీసుకోలేదన్న విమర్శలొస్తున్నాయి. కాగా భవన నిర్మాణం పూర్తిచేస్తామని ఎమ్మెల్యే రవికుమార్ హామీఇచ్చారని ఎంఎంఎస్ అధ్యక్షురాలు అరుణ తెలిపారు.పెరిగిన ధరలకు అనుగునంగా నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారని చెప్పారు.త్వరలోనే భవనం పూర్తిచేసి కార్యాకలాపాలను నూతన భవనంలో నిర్వహిస్తామని తెలిపారు.

కొత్తూరులో టీ దుకాణం దగ్ధం

కొత్తూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):కొత్తూరులోని నివగాం రహదారిలో ఓ టీ దుకాణం బుధవారం సాయంత్రం దగ్ధమయ్యింది. స్థానికులు, బాధితుడి కథనం మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో గల పెద్దదిమిలికి చెందిన సల్ల సన్యాసిరావు కొద్దేళ్లుగా టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం టీ చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్‌కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతోస్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక అధికారి బుచ్చోడు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. టీ దుకాణంలో సామగ్రి,ఫర్నీచర్, పూర్తిగా దగ్ధం కావడంతో సన్యాసిరావు లబోదిబోమంటున్నాడు.

కొండతెంబూరులో పుస్తెలతాడు చోరీ

నందిగాం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండతెంబూరులోని వివాహిత కణితి రీశాంతి మెడలో నుంచి పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. పోలీసుల కథనం మేరకు..జాతీయరహదారికి సమీపంలో గల బోరునుంచి మంచి నీరు తీసుకువెళ్లేందుకు బుధవారం ఉదయం రీశాంతి వచ్చింది.ఈక్రమంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మెడలోని రెండు తులాల బంగారం పుస్తెలతాడు తెంపుకొని పలాస వైపు వెళ్లిపోయారు. ఈమేరకు నందిగాం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో హెచ్‌సీ డిల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

టెక్కలి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):మండలంలోని డమర సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నందిగాం మండలంలోని రాంపురానికి చెందిన సువ్వారి శ్రీధర్ సైకిల్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. పాతపట్నం మండలంలోని నల్లబొంతుకు చెందిన మామిడిపల్లి సతీష్, సంతోష్ ద్విచక్రవాహనంపై మెళియాపుట్టి వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.ముగ్గురిని 108 వాహనంలో చికిత్సనిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. సతీష్, శ్రీధర్ పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం తరలించారు. ఈ మేరకు టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

19 మందిపై బైండోవర్ కేసులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సవరపోలూరు, అప్పోజిపేట, దాసుపురం, గొల్లబంజీరు గ్రామాలకు చెందిన 19 మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మీరాసాహెబ్ తెలిపారు. వీరిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

జిల్లా కేంద్రాసుపత్రిలో వ్యాక్సిన్ల కొరత

టెక్కలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలోని వ్యాక్సిన్ విభాగంలో వ్యాక్సిన్ల ఏర్పడింది. వివిధస్థాయిల్లో చిన్నారులకు వ్యాక్సిన్లు వేయించేందుకు బుధవారం ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. ప్రధానంగా పెంటావ్యాలెంట్, ఓపీవీ, ఐపీవీ, బీసీజీ వంటి కీలక వ్యాక్సిన్లు అందుబాటులో లేవు. దీంతో సిద్ధంగా ఉన్న అరకొర వ్యాక్సిన్లతో కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది టీకాలు వేశారు. 6,10, 14 నెలల చిన్నారులకు కావాల్సిన కొన్ని వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగారు. కాగా వ్యాక్సిన్ల కొరత విషయాన్ని పరిశీలిస్తామని టెక్కలి జిల్లా ఆసుపత్రిసూపరింటెండెంట్ సూర్యారావు, కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఇంద్రజ తెలిపారు.

సముద్ర సాన్నాలపై సందర్శకులకు అవగాహన

సంతబొమ్మాళి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): భావనపాడు సముద్రతీరంలో స్నానాలు చేయడానికి వచ్చిన సందర్శకులకు స్థానిక మెరైన్ పోలీసులు అవగాహన కల్పించారు. బుధవారం మాఘపౌర్ణమి పురస్కరించుకుని ఇక్కడి తీరానికి స్నానాలకు చేసేందుకు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ఈ సందర్భంగా తీరంలో స్నానాలు ఎక్కడ చేయాలని, సముద్రంలో ఎంత దూరంలో స్నానం చేయాలన్నవిషయాలపై మెరైన్ సీఐ రాము అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్‌సీ నీలకంఠం, వేణు పాల్గొన్నారు.

పలాసలో కుంభ సంక్రమణం హోమం

పలాసరూరల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):పలాసలోని సీతారామాలయ కాంప్లెక్స్‌లోగలజగన్నాథాలయంలో జైజగన్నాథ ఒడియాబ్రాహ్మణ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కుంభ సంక్రమణం హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బాబూరావు పండా, కైలాస్‌దాస్,బాలకృష్ణ, దాస్ పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

నందిగాం,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని కణితివూరులో కొత్తమ్మతల్లి ఆలయం 22వ వార్షికోత్సవంబుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, కుంకుమార్చనలు, హోమం చేశారు.

● పాతపట్నం,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని బోరుభద్రలో అభయాంజనేయ ఆలయ మూడో వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానకార్యక్రమంలో బోరుభద్రతోపాటు చిన్నలోగిడి పెద్దలోగిడి తదితర గ్రామాలకు భక్తులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గ ఆలయంలో హుండీల లెక్కింపు

పాతపట్నం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయానికి 38 రోజులకు రూ.5,89,324 ఆదాయం లభించినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. బుధవారం దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయ సీనియర్ సహాయకులు జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో నీలమ ణిదుర్గ ఆలయంలోని హుండీలను లెక్కించారు.కార్యక్రమంలో అర్చకులు తోలాపు సంతోష్‌కుమార్ వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య

22,493

● 123 పోలింగ్ కేంద్రాలు

● నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరి రోజు

విశాఖపట్నం,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయఎమ్మెల్సీ స్థానా నికి సంబంధించి మొత్తం 22,493 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో పురుషులు 13,508, మహిళలు 8,985 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,529 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మందిఉన్నారు. కాగా ఈనెల 27న జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

జిల్లాల వారీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం జిల్లా	31	3,416	1,619	5,035
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333
విజయనగరం జిల్లా	29	3,270	1,953	5,223
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,999	5,529
అనకాపల్లి జిల్లా	24	1,789	1,096	2,885
మొత్తం	123	13,508	8,985	22,493

రామ్మోహన్‌నాయుడుకి యువవక్త పురస్కారం



అవార్డు అందుకుంటున్న రామ్మోహన్‌నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు యువవక్త పురస్కారం లభించింది.ఈ మేరకుపూణేలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ ఉత్తమ వక్త ఆఫ్ పార్లమెంట్ ప్రాక్టీసెస్ అవార్డును ప్రదానం చేసింది. చిన్నవయసులో ఎంపీగా, కేంద్రమంత్రిగా రామ్మోహన్ తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారని నిర్వాహకులు కొనియాడారు.

తహసీల్దార్ భార్యకు కారుణ్య నియామకం



అనూషకు నియామకపత్రం అందజేస్తున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్య భార్య అనూషకు కారుణ్య నియామకంలో భాగంగా డీటీగా నియమిస్తూ కారుణ్య నియామక పత్రాన్ని బుధవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన తహసీల్దార్ రమణయ్య గతఏడాది ఫిబ్రవరి 2న హత్యకు గురైన విషయం విదితమే. తనను ఆదుకుని, న్యాయం చేసిన ప్రభుత్వానికి, మంత్రి అచ్చెన్నాయుడుకు అనూష కృతజ్ఞతలు తెలియజేశారు.

17 నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు



స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మందసలో ఈనెల 17 నుంచి 23 వరకు వాసుదేవ పెరుమాళ్ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.ఈమేరకు బుధవారంఉత్సవాలకు కలెక్టరేట్‌లో స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో వేదపండితులు, టీడీపీ నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో వేదపండితులు కూర్మాచార్యులు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, డొంకూరు తిరుపతిరావు, సంతోష్ పండా, రాజాన మహేష్, రోధియా చక్రి, జామిప్రసాద్, కిల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు: ఎమ్మెల్యే



జలుమూరు: పంచముఖ అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న రమణమూర్తి

నరసన్నపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ప్రహరీ గోడ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు అంచనాలు ప్రాప్తికి మెటీరియల్ వినియోగించి నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నాణ్యతలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆసుపత్రి ఏవో రమణమూర్తి, టీడీపీ నాయకులు గొద్దు చిట్టిబాబు, బైరి భాస్కరరావు ఉన్నారు.

● జలుమూరు (సారవకోట)ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): :ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సారవకోట మండలంలోని సవరడ్డపనసలోని పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించినపూజల్లో పాల్గొనిస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు తేజకుమార్, ఉమామహేశ్వరరావు, తిరుపతిరావు, పి.నందకిశోర్ ఉన్నారు.

పాతపట్నంలో చార్లెస్ డార్విన్‌కు నివాళి



మానవుడి పరిణామ క్రమంపై వేషధారణ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాతపట్నం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): జీవ పరిణామ ధ్రువీకరణకు శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ పరిశోధనలే ప్రామాణికామని హెచ్ఎంఎస్. వైకుంఠరావు తెలిపారు.బుధవారం పాతపట్నం ప్రభుత్వోన్నత పాఠశాలలో చార్లెస్ డార్విన్ జయంతి పురస్కరించుకుని డార్విన్ పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవపరి మాణాలపై విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీచర్ ఎన్‌టీ రామారావు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు: సీఐ

జలుమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో మూడు రోజులు పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీముఖలింగంలో జలుమూరు, సారవకోట, నరసన్నపేట ఎస్.ఐలు అశోక్‌బాబు, అనిల్‌కుమార్, దుర్గాప్రసాద్‌లతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీముఖలింగం వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఏర్పాటు చేయాలని కోరారు. మూడురోజులపాటు వాహనాలను గ్రామంలోకి అనుమతించరాదని తెలిపారు.

16న వ్యాసరచన పోటీలు

పలాస, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పలాసలోని శ్రీరామకృష్ణ సేవాసంఘం 65వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈనెల 16న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.స్వర్ణోత్సవభారత రాజ్యాంగ సాఫల్య వైఫల్యాలు అన్న అంశంపై వ్యాసరచన, యువతను నిర్వీర్యంచేస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనలో సమాజం, ప్రభుత్వాలపాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

కేసుల రాజీకి సహకరించాలి

టెక్కలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసుల రాజీకి సహకరించాలని టెక్కలి జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణి కోరారు. బుధవారం టెక్కలిలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చిఎనిమిదో తేదీన జరగనున్న లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సహకరించాలనికోరారు. సమావేశంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాకివలసలో కంటి పరీక్షలు

నరసన్నపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాకివలస పీహెచ్‌సీలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్తాలమిస్టు బాలగంగాధర రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ అమలు చేయండి

మెళియాపుట్టి, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మెనూ అమలు చేయాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా కోరారు. బుధవారం బందపల్లి ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందజేయాలని,పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణంలో నాణ్యత పాటించాలని కోరారు.

వంట పాత్రల వితరణ

పలాసరూరల్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడుకు చెందిన కళాకారుడు గేదెల చిన్నారావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు స్థానిక అగ్నికులక్షత్రియ సంఘానికి రూ.50వేల విలువ గల వంట పాత్రలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన చిన్నారావు సంస్మరణలో లక్ష్మణరావు, బొడ్డు దుష్యంత్, బుడత ధనరాజ్, బొడ్డు మహాలక్ష్మి, సింహాద్రి, వాసుదేవ్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్ మృతి

నందిగాం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): శివరాంపురానికి చెందిన వెయిట్ లిఫ్టర్ ఇప్పిలి ధనుంజయరావు(43) అనారోగ్యంతో బుధవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన వివిధ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించి గుర్తింపు పొందారు.ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

సోమేశ్వరరావు మృతి తీరని లోటు

హరిపురం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని బహడపల్లి మాజీ సర్పంచ్ సార సోమేశ్వరరావు మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. బుధవారం సోమేష్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, పీరకట్ల విఠల్, లబ్బ రుద్రయ్య, తాతారావు ఉన్నారు.

ఈయూ వార్షికోత్సవం

టెక్కలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 76వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ కార్మిక భవన్‌లో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రాంతీయ అధ్యక్షులు ఎన్.లోకేశ్వరరావు, డి.శేఖర్, కె.గిరీశ్వరరావు, జి.రాజారావు పాల్గొన్నారు.

చీడిపూడిలో చక్రతీర్థ స్నానాలు



జలుమూరు: చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు

జలుమూరు, (సారవకోట) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని చీడిపూడిలో వేంకటేశ్వరస్వామి చక్రతీర్థ స్నానాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి జరుగుతున్న ఉత్సవాలు ఆఖరి రోజు వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ, పద్మావతి ఉత్సవ విగ్రహాలకు అలంకరించి అవలింగి, చీడిపూడిల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించి అచ్చెన్నాయుడు చెరువులో ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానాలు ఆచరించారు.

శివసాగర్ తీరంలో పుణ్యస్నానాలు

వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):శివసాగర్ తీరంలో మాఘ పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలతోపాటు,చుట్టుపక్కల గామాలు, ఒడిశాలోని పలు ప్రాంతాల భక్తులు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు.

కరకవలసలో సామాజిక తనిఖీ

జలుమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కరకవలసలో బుధవారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన పి.ఈశ్వరరావుపై అభియోగాల నేపథ్యంలో ఆయన్ను తొలగించి ఇన్‌చార్జి ఫీల్డ్‌అసిస్టెంట్‌ను నియమించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్ ఇంటింటికి వెళ్లి సామాజిక తనిఖీ నిర్వహించిన బృందానికి మంగళవారం ఆటంకం కలిగించాడని, దీంతో గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. ఈమేరకు అధికారులు పోలీసులు సమక్షంలో ఇంటింటికి వెళ్లి బృందం చేసిన ఉపాధి పనులు, పింఛన్లు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించారు.

'సూర్యఘర్'ను వినియోగించుకోండి: డీడీవో



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

పలాస, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం విద్యుత్‌ను ఆదా చేసేందుకు అమలుచేస్తున్నప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి, ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు కోరారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయంలో పలాస డివిజన్ పంచాయతీ కార్యదర్శులకు సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ ఐ.కృష్ణమూర్తి, ఎంపీడీవో వసంతరావు, ఏఈలు నాగభూషణరావు, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలపై మారణకాండను నిలిపివేయాలి

పలాస రూరల్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మధ్య భారత అడవుల్లో కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదివాసీల మారణ కాండను నిలిపివేయాలని వామపక్ష సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బొడ్డపాడులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల బీజాపూర్ జిల్లాలో 31 మంది మావోయిస్టులను ఎదురు కాల్పుల పేరిట చంపిచారని, దీనికి పిట్టకథగా ఇద్దరు జవాన్లు మృతి చెందినట్లు పేర్కొన్నారని తెలిపారు

సబ్ కమిటీల పనితీరు కీలకం: ఏపీఎం

హరిపురం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి సబ్ కమిటీల పనితీరే కీలకమని వెలుగు ఐటీడీఏ ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. మందస వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సవరకాం తమ్మ అధ్యక్షతన క్లస్టర్ కోఆర్డినేటర్ల కు శిక్షణ నిర్వహిం చారు.

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు: ఏవో

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్యకు నమోదు చేయించుకుంటేనే పథకాలు వర్తిస్తాయని ఏవో పి.లత్రాశ్రీ తెలిపారు. ఎల్.ఎన్.పేటలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవ సాయరంగాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు కేంద్రం రైతులకు 14 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట గుర్తింపుసంఖ్యను ఆధార్‌కార్డు తరహాలో అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.